
సాక్షి బాపట్ల

గురువారం । 2 । జనవరి । 2025



వామనావతారంతో గ్రామోత్సవం

అచ్చంపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలందుకున్న సీతాసమేత శ్రీరామ చంద్రుడికి బుధవారం వామనావతారంతో గ్రామోత్సవం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 570.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 8,604 క్యూసెక్కులు వదిలారు.

మూలాంకురేశ్వరికి పూజలు



ఫిరంగిపురం: అమీనా బాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి ఆల యంలో బుధవారం విశేషపూజలు నిర్వహిం చారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృ తాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

బాపట్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ @ 160



బాపట్ల: ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 160వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. 1865 జనవరి 1న బాపట్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభమైన సందర్భంగా బుధవారం సబ్ రిజిస్ట్రార్ ఎస్.జాన్‌మోహన్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాపట్లకు తరతరాల ఘన చరిత్ర ఉందని తెలిపారు. పెద్ద నగరాలలో లేని ప్రభుత్వ కార్యాలయాలు ఆనాడే ఇక్కడ ఉండేవని చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో పనుల నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వల్ల బాపట్ల పట్టణానికి బహుళ ప్రాచుర్యం కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి పి.సి.సాయిబాబు, వెలుగు ఏపీఎం దగ్గుబాటి సురేష్, సీనియర్ అసిస్టెంట్ జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషిచేయాలి



బాపట్ల: నూతన సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అధికారులు పూర్తిస్థాయి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం జిల్లా అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్‌ను కలసిన వారిలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్, ఆర్డీఓ గ్లోరియా తదితరులు ఉన్నారు.

వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు




తాడేపల్లి రూరల్ : శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ధనుర్మాస వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మంగళగిరి బాపూజీ విద్యాలయంలో 17వ రోజు 17వ పాశురాన్ని భక్తులకు ఆయన వివరించారు. అనంతరం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి స్వయంగా ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మనిషి ప్రవృత్తి, విధి విధానాలు, భగవంతునిపై ఉండవలసిన నిష్ఠ, ఏ విధంగా ఆచరణలో పెట్టాలో వివరించారు. 14 ప్రాంతాల నుంచి సుమారు 340 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి.

యార్డులో 44,245 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 40,208 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 44,245 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 13,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,800 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 47,476 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1,416 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు., బ్యాంక్ కెనాల్‌కు 168, తూర్పు కెనాల్‌కు 180, నిజాంపట్నం కాలువకు 34, కొమ్మమూరు కాలువకు 840 క్యూసెక్కులు వంతున వదిలారు.

బార్‌లా మద్యం దుకాణాలు

- నిబంధనలకు విరుద్ధంగా షాపుల వద్ద సిట్టింగ్ రూములు
- ఫ్యామిలీలు, పాఠశాలలు, మసీదులు, గుడులున్న ప్రాంతాల్లో మద్యం తాగేందుకు ఏర్పాట్లు
- వేలంపాట పద్ధతిలో ఊరూరా బెల్ట్ షాపులు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్, సివిల్ పోలీసులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం



వేటపాలెంలో మద్యం షాపు వద్ద బార్ తరహాలో పర్మిట్ రూము ఏర్పాటు చేసిన యజమానులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: గుడి.. బడి అనే తేడా లేకుండా జిల్లాలో మద్యం దుకాణాలు విచ్చవిడిగా వెలుస్తున్నాయి. నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వేటపాలెంలో పోలీసు స్టేషన్‌కు పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. మందు విక్రయించి అక్కడి నుంచి పంపించి వేయాల్సిన షాపు వారు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అక్కడే బార్‌ను తలపించేలా పెద్ద పర్మిట్ రూం నిర్మించారు. మద్యంతో పాటు వాటర్ బాటిల్స్, స్నాక్స్ విక్రయిస్తున్నారు. బార్ కంటే వసతి బాగుండడంతో షాపు వద్దే మందుబాబులు మద్యం తాగుతూ అర్ధరాత్రి వరకూ తిష్టవేస్తున్నారు. పోలీసు స్టేషన్‌కు మద్యం షాపునకు మధ్య వెయ్యిమంది విద్యార్థినులు ఉన్న గరల్స్ ఉన్నత పాఠశాల ఉంది. పాఠశాలకు రాకపోకలకు మద్యం షాపు మీదుగా ఉన్న దారిలోనే వెళ్లాలి. ఇటీవల మందుబాబుల వెకిలి చేష్టలు శృతిమించడంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని పోలీసులు

అసలే నేరాలకు అడ్డాగా మారిన చీరాలలో ఎప్పుడే నేరం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. మద్యం షాపు చుట్టూ పలు కుటుంబాలు నివసిస్తున్నారు. పక్కనే పురాతన మసీదు కూడా ఉంది. పోలీసులు మద్యం షాపు ముందునుంచే వెళ్లాలి. బార్‌ను తలపించేలా పర్మిట్ రూముకట్టినా పోలీసులు నోరు మెదపడంలేదు. ఎక్సైజ్, సివిల్ పోలీసులు, అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. పైగా ఇక్కడి ఎక్సైజ్ ఉన్నతాధికారి తమ సామాజికవర్గం వారేనని, ఎవరూ ఏమీ చేయలేరని సదరు షాపు యజమాని బాహాటంగానే ప్రచారం చేసుకుంటుండడం చర్చనీయాంశంగా మారింది. ఒక్క వేటపాలెంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా ఉన్న 117 మద్యం షాపులు, వాటి పరిధిలో వెలిసిన మూడు వేలకు పైగా బెల్టు షాపుల్లో తొంభై శాతం దుకాణాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

నిబంధనలకు నీళ్లు

చీరాల, పర్చూరు, బాపట్ల, అద్దంకి, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని మద్యం షాపులవద్ద షాపు యజమానులు కొందరు నేరుగా పర్మిట్ రూములు నిర్మిస్తే మరికొందరు మద్యం షాపుల పక్కనే కూల్‌డ్రింక్ షాపులను ఏర్పాటు చేసి మందు బాబులకు సిట్టింగ్‌లు సిద్ధం చేశారు. అక్కడే మందుతోపాటు మిగిలిన సామగ్రి అందిస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటలవరకే మద్యం షాపులు నడపాలన్న నిబంధనలకు తుంగలో తొక్కారు. అర్ధరాత్రి వరకూ దుకాణాలు నడిపి ఆ తర్వాత 24 గంటల పాటు బెల్ట్ షాపులను అందుబాటులోకి తెచ్చారు. దీంతో మందుబాబుల ఎక్కడికక్కడే దర్జాగా తాగి చిందులు వేస్తున్నారు.

వేలం పాట పద్ధతిలో బెల్టు షాపులు

జిల్లావ్యాప్తంగా మద్యం షాపుల యజమానులు బెల్టు షాపులను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. ఇందుకోసం గ్రామాలు, గ్రామపంచాయతీల పద్ధతిలో వేలంపాట నిర్వహించారు. పెద్ద గ్రామాల్లో బెల్టు దుకాణాల ఏర్పాటు రూ. 2 నుంచి 5 లక్షల వరకూ కప్పం కట్టించుకుంటున్నారు. చిన్న గ్రామాల్లో రూ. 50 నుంచి రూ. 1 లక్ష వసూలు చేస్తున్నారు. పోటీ ఉన్న దగ్గర ఎవరు ఎక్కువ మొత్తం చెల్లించినవారికే బెల్టు దుకాణాలు కట్టబెడుతున్నారు. పర్చూరు, చీరాల సముద్ర తీర ప్రాంతాల్లో ఉన్న కొన్ని గ్రామాల్లో బెల్టు షాపుల ఏర్పాటుకు స్థానికులు పెద్ద మొత్తంలో రుసుం చెల్లించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో బెల్టు షాపుల వేలంపాటలు జరిగినట్లు సమాచారం. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో కొందరు స్థానిక పచ్చ నేతలు బెల్టు షాపులను వేలం పాటలో దక్కించుకున్నారు. తిరిగి వాటిని చిన్నగ్రామాల్లో అయితే రెండు మూడు, పెద్ద గ్రామాల్లో ఆరు నుంచి ఎనిమిది బెల్టు షాపులుగా తిరిగి విక్రయించారు. ఇందుకోసం బెల్టు షాపులు కేటాయించిన ఒక్కొక్కరి వద్ద రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. పచ్చనేతలకు ఇది లాభసాటి వ్యాపారంగా మారింది.

అమలు కాని ఆదేశాలు

''ఎక్కడా బెల్టు షాపు కనపడకూడదు. ఇందుకోసం కఠిన చర్యలు తీసుకోవాల''ని మంగళవారం జరిగిన సమీక్షలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అటు ఎక్సైజ్ అధికారులతో పాటు సివిల్ పోలీసులు బెల్ట్ షాపులను మరింతగా ప్రోత్సహిస్తున్నారు. షాపుల నుంచి నెల మామూళ్లు ముడుతుండడం వల్లే పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

అధిక ధరలకు మద్యం విక్రయాలు

బెల్టు షాపుల నిర్వాహకులు మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి దోపిడీ చేస్తున్నారు. ఒక్కో మద్యం బాటిల్ పై రూ. 20 నుంచి 50 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. మద్యానికి బానిసలైన వ్యక్తులు అర్ధరాత్రి, ఉదయాన్నే ఒక్కో బాటిల్‌పై రూ.వంద అదనంగా పెట్టి మద్యం కొని తాగుతున్న పరిస్థితి నెలకొంది. బెల్ట్ షాపుల ఏర్పాటు వల్ల అందుబాటులో మద్యం ఉండడంతో పేదలు తాగి నష్టపోతున్నారు. ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

కిక్‌రిసిన వైన్ షాపులు

- న్యూ ఇయర్ వేడుకల్లో జోరుగా మద్యం అమ్మకాలు
- జిల్లాలో రూ.3.24 కోట్ల మేర తాగేశారు



చీరాల: కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను బార్లా తెరవడంతో మందుబాబులు తాగి ఊగారు. ఆదాయాన్ని పెంచుకునేందుకు మద్యం అమ్మకాలను సులువు చేసింది. ఏకంగా అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతులు ఇవ్వడంతో మందుబాబులు కిక్కుతో చిందేశారు. పట్టణాలలో, తీర ప్రాంతాలలో, రిసార్టులు, రెస్టారెంట్లు హౌస్‌ఫుల్ కలెక్షన్లతో నిండిపోయాయి. జిల్లాలో డిసెంబర్ 31న మద్యం ద్వారా రూ.3.24 కోట్ల మేర అమ్మకాలు జరిగాయి.

ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మద్యం షాపులను ఏర్పాటును ప్రైవేటు వ్యక్తులకు కేటాయించింది. పట్టణ, రూరల్ ప్రాంతాలలో టెండర్ల ద్వారా మద్యం షాపులను అప్పగించింది. పైగా నూతన సంవత్సరం సందర్భంగా మద్యం షాపుల సమయాన్ని రాత్రి ఒంటి గంట వరకు పొడిగించింది. దీంతో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. షాపులన్నీ మద్యం ప్రియులతో కిక్కిరిపోయాయి. నూతన సంవత్సర ఆరంభానికి మద్యం అమ్మకాలు వ్యాపారులకు మంచి 'కిక్కు' ఇచ్చాయి. మద్యం షాపులు, రిసార్ట్స్, బార్ అండ్ రెస్టారెంట్లు మద్యం ప్రియులతో కిక్కిరిసిపోయాయి.

జిల్లాలో 3948 కేసుల మద్యం అమ్మకాలు

డిసెంబర్ 31వ తేదీ సందర్భంగా షాపులకు ముందుగానే వ్యాపారులు మద్యం లోడ్‌లను తెప్పించుకున్నారు. జిల్లాలో బాపట్ల, రేపల్లె, నగరం, వేమూరు, చీరాల, పర్చూరు, అద్దంకి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మద్యం అమ్మకాలు జోరుగా ఉన్నాయి. జిల్లాలో మొత్తం రూ.3.24 కోట్ల మేర అమ్మకాలు జరిగాయి.

అమ్మకాలు ఇలా..

ఏరియా	మద్యం కేసులు	బీరు కేసులు
బాపట్ల	903	613
రేపల్లె	468	203
నగరం	342	179
వేమూరు	482	164
చీరాల	762	626
పర్చూరు	264	210
అద్దంకి	727	278
మొత్తం	3,948	2,273

చిరుద్యోగులపై కూటమి కక్ష సాధింపు

చేబ్రోలు: కొత్త సంవత్సరం రోజున కూటమి ప్రభుత్వం చిరుద్యోగులపై ప్రతాపం చూపింది. సర్కార్ తీరుపై బాధితులు నిరసన వ్యక్తం చేసిన సంఘటన చేబ్రోలులో బుధవారం జరిగింది. చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీలో 20 సంవత్సరాలుగా కార్మికులుగా పనిచేస్తున్న వారిలో 12 మందిని బుధవారం నుంచి విధుల్లోకి రావద్దని పంచాయతీ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. ఇద్దరు గ్రీన్ అంబాసిడర్స్, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, నైట్ వాచ్‌మెన్, వాటర్ వర్కర్‌గా పనిచేస్తున్న మొత్తం 12 మంది టెండర్ వర్కర్స్‌కు ఉద్వాసన పలుకుతూ ఆదేశాలు ఇచ్చారు. కార్మికులు ఉదయం 6 గంటల నుంచి విధులకు వెళ్లకుండా చేబ్రోలు మెయిన్ రోడ్డులోని లైబ్రరీ సెంటర్‌లో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దారు కె. శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కార్మికులను చట్ట విరుద్ధంగా పనుల నుంచి తొలగించటం అన్యాయమన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

బరితెగింపునకు సిద్ధం



తూర్పుపాలెం వద్ద కోడిపందాల కోసం సిద్ధం చేసిన పొలాలు

- చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో 30 ఎకరాలలో సిద్ధం చేస్తున్న బరులు
- సంప్రదాయం పేరుతో కోడి పందేలకు ఏర్పాట్లు



బరుల వద్ద ఫెన్సింగ్ కోసం సిద్ధంగా ఉంచిన సిమెంట్ పోల్స్



సంక్రాతి సంబరాల పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రేపల్లె రూరల్: సంక్రాంతి సంప్రదాయం పేరుతో కోడి పందేలకు రేపల్లె తీరం ముస్తాబవుతోంది. అక్రమార్జనలో డబ్బు దండుకునేందుకు కూటమి నేతలు ఏర్పాట్లు చురుకుగా చేస్తున్నారు. రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం తూర్పు పాలెం వద్ద 30 ఎకరాలలో కోడి పందేలను నిర్వహించేందుకు ఇప్పటికే పొలాలను లీజుకు తీసుకున్నారు. చెరుకుపల్లి మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు బరుల నిర్వహణ బాధ్యతను చక్కబెడుతున్నట్లు సమాచారం. సంక్రాంతి సంబరాల పేరుతో మూడు రోజుల పాటు పేకాట, కోడిపందేలు, గుంటాట వంటి జూదాల నిర్వహణకు పొలాలను చదును చేశారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. ఎకరానికి రూ.15వేల చొప్పున సంబంధిత పొలం రైతులకు చెల్లించి 30 ఎకరాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే బరులు ఏర్పాటు చేసే ప్రాంతం వద్ద రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఫొటోలతో సంక్రాంతి సంబరాల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

రహదారులు రక్తసిక్తం

- రోడ్డు ప్రమాదంలో తోడల్లుళ్లు మృతి
- ప్రార్థనల కోసం చర్చికి వెళ్తుండగా దుర్ఘటన
- మరో మహిళ పరిస్థితి విషమం
- మార్టూరు జాతీయ రహదారిపై ఘటన
- భీతావహంగా మారిన ప్రమాద స్థలం



భర్త, బావల మరణంతో తల్లడిల్లుతున్న గోపి భార్య నాగలక్ష్మి



రాము (ఫైల్)



గోపి (ఫైల్)



అపస్మారక స్థితికి చేరుకున్న రాము భార్య ఉమ

మార్టూరు: నూతన సంవత్సరంలో అంతా మంచే జరగాలని, తమకు కలిసి వచ్చిన చర్చికి వెళ్తుండగా లారీ రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. దీంతో తోడల్లుళ్లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన మండలంలోని తాతపూడి, డేగరమూడి గ్రామాల మధ్య రహదారిపై సోమవారం జరిగింది. మార్టూరు ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాల మేరకు.. మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన పల్లపు గోపి (29), విజయనగరం జిల్లాకు చెందిన నాగలక్ష్మిని ఏడాది కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. నాగలక్ష్మి అక్క ఉమకి పదేళ్ల కిందట విజయనగరం జిల్లా బాడంగి మండలం పీ వెంకంపేట గ్రామానికి చెందిన కొల్లు రాము (32)తో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అక్కాచెల్లెళ్ల రెండు కుటుంబాలు గత కొన్నేళ్లుగా విజయవాడలోని వాంబే కాలనీలో నివాసం ఉంటూ గ్రానైట్ సంబంధిత పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

తమకు కలిసి వచ్చిన చర్చికి వెళ్తూ..

మృతుడు పల్లపు గోపి మార్టూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో అతనికి గతంలో అద్దంకి మండలం రెడ్డిపాలెం గ్రామంలోని చర్చికి ప్రార్థనల నిమిత్తం వెళ్లే అలవాటు ఉంది. ఈ క్రమంలో నూతన సంవత్సర వేళ ప్రార్థనల కోసం మొత్తం ఎనిమిది మంది బంధువులు కలిసి నాలుగు బైకుల్లో విజయవాడ నుంచి రెడ్డిపాలెం చర్చికి బయలుదేరారు. ఒక బైకుపై రాము అతని భార్య ఉమ, తోడల్లుడు గోపి వెళ్తున్నారు. మరో బైకుపై గోపి భార్య నాగలక్ష్మి తన తమ్ముడితో ప్రయాణిస్తోంది. ఈక్రమంలో తాతపూడి, డేగరమూడి గ్రామాల మధ్య రహదారిపై ముందు వెళ్తున్న లారీని దాటే క్రమంలో రాము బైకు ప్రమాదవశాత్తు లారీ కింద పడిపోయింది. ప్రమాద తీవ్రతకు రాము తలపగిలింది. మెదడు రహదారిపై చెల్లాచెదురుగా పడటంతో వాతావరణం అంతా భీతావహంగా మారింది. గోపి సైతం తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తల పగిలి ముక్కు చెవుల నుంచి తీవ్ర రక్తస్రావం అవుతూ ఫిట్స్‌తో ఉన్న రాము, భార్య ఉమను స్థానికుల సమాచారంతో చిలకలూరిపేట 108 సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఉమ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు ఆమెను అదే వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న మార్టూరు పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం హైవే సిబ్బంది సహాయంతో ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతుడు గోపి భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైకులు ఢీ : ఒకరు మృతి

అద్దంకి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన మండలంలోని నాగులపాడు రోడ్డులో బుధవారం తెల్లవారుజామున జరిగింది. నాగులపాడు గ్రామానికి చెందిన బాపయ్య చౌదరి బైక్‌పై అద్దంకి నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ సమయంలో అద్దంకిలోని గరటయ్య కాలనీకి చెందిన బిక్కి అజయ్ (40) బైక్‌పై నాగులపాడు వైపు నుంచి అద్దంకికి వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు బైకులు నాగులపాడులోని ఎస్సీ శ్మశానవాటిక వద్ద ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో అజయ్‌కు తీవ్రగాయాలు అవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన బాపయ్యను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. మృతుడు అజయ్ కారు డ్రైవర్‌గా పని చేస్తుంటాడు.

కారు, బైక్ ఢీ: ఒకరి మృతి



సుబ్బారావు (ఫైల్)



గాయపడిన నాగబాబు, పొదల్లో పడిన సుబ్బారావును వెతుకుతున్న స్థానికులు

వెల్లటూరు(భట్టిప్రోలు): పొగ మంచులో కారు, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందగా ఇద్దరు గాయాలతో బయట పడిన సంఘటన బుధవారం జరిగింది. భట్టిప్రోలు ఎస్ఐ ఎం. శివయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు మండలం జువ్వలపాలెం పంచాయతీ పరిధిలోని గుంటూరు గూడేనికి చెందిన శొంటి నాగబాబు, శొంటి సుబ్బారావు (65) బుధవారం ఉదయం వెల్లటూరు వైపు వస్తున్నారు. స్థానిక చినరేవు వంతెన వద్ద ఉన్న శ్మశానవాటిక దగ్గరకు వచ్చేసరికి పొగ మంచు కారణంగా కారు, ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న సుబ్బారావు సమీపంలోని పొదల్లో దూరంగా పడిపోయాడు. వాహనం నడుపుతున్న నాగబాబు పక్కనే పడ్డాడు. ప్రమాదంలో సుబ్బారావు ఎడమ కాలు నుజ్జునుజ్జుగా మూడు ముక్కలుగా కావడంతో తీవ్ర రక్త స్రావమైంది. నాగబాబు కాలుకు, ఒంటిపై తీవ్ర గాయాలై తెనాలిలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కారు నడుపుతున్న కొల్లూరు మండలం కిష్కింధపాలేనికి చెందిన వ్యక్తికి కూడా తీవ్ర గాయాలు కావడంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం మేరకు 108 సిబ్బంది వీరిని తెనాలి తీసుకు వెళుతుండగా సుబ్బారావు మార్గంమధ్యలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివయ్య తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం



అమరేంద్ర మృతదేహం

నిజాంపట్నం: మద్యం ఓ పండంటి కాపురంలో చిచ్చు రేపింది. భార్యాభర్తల మధ్య గొడవలకు ఆజ్యం పోసింది. ఒకరు ప్రాణాలు కోల్పోయిన సంఘటన నిజాంపట్నం మండలం కొత్తపాలెం పంచాయతీ పెద్దూరులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గోకర్ణమఠం గ్రామానికి చెందిన అమరేంద్రకు కొత్తపాలెం పంచాయతీ పెద్దూరుకు చెందిన అరుణతో 12 సంవత్సరాల కిందట వివాహమైంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతంలో హోంగార్డుగా పనిచేసిన అమరేంద్ర మద్యానికి బానిసై ఉద్యోగాన్ని కోల్పోయాడు. తాగి తరచూ భార్యతో గొడవలు పడుతుండేవాడు. ఇద్దరి మధ్యా గొడవలు ఎక్కువవ్వడంతో ఏడాది కిందట అరుణ పిల్లలతో స్వగ్రామమైన పెద్దూరుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మద్యం తాగిన అమరేంద్ర భార్యపై దాడికి తెగబడ్డాడు. ప్రతిఘటించిన అరుణ అమరేంద్రను అడ్డుకునే క్రమంలో ఆమె చేతిలోని కర్ర అతని తలకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, శవపంచనామా నిర్వహించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామరు.

ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్‌గా రామారావు



లబ్బీపేట(విజయవాడతూర్పు): కార్మిక రాజ్యబీమా సంస్థ (ఈఎస్ఐసీ) విజయవాడ ప్రాంతీయ కార్యాలయ రీజినల్ డైరెక్టర్‌గా ఎం.రామారావు, జాయింట్ డైరెక్టర్‌గా ప్రణవకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈఎస్ఐ లబ్ధిదారుల కోసం ఆరోగ్య అవగాహన, ఆధార్ సీడింగ్ శిబిరాలను ఏర్పాటు చేసి, అవగాహన పెంచే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్మికుల సామాజిక భద్రత అవసరాలను తీర్చడం, మెరుగైన ఆరోగ్య సేవలను అందించడం, ప్రాథమిక ఆరోగ్య సేవలను పెంచడంపై దృష్టి పెడతామన్నారు. రాష్ట్రంలోని 54 లక్షల మంది చందాదారులకు ఈఎస్ఐ ఆస్పత్రులు, ఔషధ కేంద్రాల ద్వారా అధిక నాణ్యతతో వైద్య సేవలను అందించడంలో సహాయం చేస్తామని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **3,000**

మోడల్ ధర రూ. **2,500**

క్లుప్తంగా

కార్పెంటర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆవిష్కరించారు. అసోసియేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ కోడూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్పెంటర్లు ఐక్యతతో హక్కులు సాధించుకునే దిశగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌జీఈఎస్ ఏపీవో శివపార్వతి, మల్లోలు రవి, సీసీ హనోకు, అకౌంటెంట్ బత్తుల శిరీష, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

సంతమాగులూరు (అద్దంకి): స్నేహితుల ఇంట్లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొని వస్తుండగా బైకును లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సంతమాగులూరు మండలం పాతమాగులూరు సమీపంలోని లక్ష్మీపురం సమీపంలో బుధవారం జరిగింది. వివరాలు.. పాత మాగులూరుకు చెందిన ఉన్నం బ్రహ్మేశ్వర రావు (45) నరసరావుపేటలోని నూతన సంవత్సరం వేడుకల్లో మిత్రులతో కలిసి పాల్గొని గ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో పాత మాగులూరు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో కిందపడి తీవ్రంగా గాయపడిన బ్రహ్మారావును స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది నరసరావుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

17 నుంచి జూట్ బ్యాగ్స్, మగ్గం వర్క్స్‌పై ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 17వ తేదీ నుంచి జూట్ బ్యాగ్స్ తయారీ, 22వ తేదీ నుంచి మగ్గం వర్క్స్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. జూట్ బ్యాగ్స్ తయారీ 13 రోజులు, మగ్గం వర్క్స్ తయారీపై 30 రోజులు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు చిరునామాలో సంప్రదించాలని సూచించారు. 0863 - 233 6912, 97006 87696, 81253 97953, 99499 30155 ఫోను నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసు కోవాలని కోరారు. ఈ అవకాశాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు ఎడ్ల పందేలు

ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల టౌన్: సంస్కృతి, సంప్రదాయాలకు ఎడ్ల పందేలు ప్రతీకలని ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య అన్నారు. మండలంలోని ఈపూరుపాలెం పంచాయతీలోని బోయినవారిపాలెంలో శ్రీకృష్ణ యాదవ యూత్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన పోలురాధ ఎడ్ల పందేలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత 25 సంవత్సరాలుగా బోయినవారిపాలెంలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించటం గ్రామానికే గర్వకారణమని తెలిపారు. రైతులు, పశు పోషకులు ఎడ్ల పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

తరలివచ్చిన పశు పోషకులు

ఎడ్ల బలప్రదర్శన తిలకించడానికి, పోటీలలో పాల్గొనేందుకు గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి పశుపోషకులు తరలివచ్చారు. ఈ పోటీలలో 19 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. పోటీలలో తమ సత్తా చాటేందుకు ఎడ్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఎడ్ల బలప్రదర్శనలో ప్రేక్షకులు ఈలలు, కేరింతలతో బోయినవారిపాలెం హోరెత్తింది. ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు, నాలుగో బహుమతిగా రూ7 వేలు, 5వ బహుమతిగా రూ.5 వేలు అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

అప్పాజోస్యులకు సాహిత్య పాథోనిధి పురస్కార ప్రదానం



సత్యనారాయణకు సాహిత్య పాథోనిధి పురస్కార ప్రదానం

నగరంపాలెం: స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీ విద్యాభవన్ ఆడిటోరియంలో బుధవారం అజో–విభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు సాహిత్య పాథోనిధి పురస్కారాన్ని ప్రదానం చేశారు. సంస్కృతి సంగీత నృత్య సాహిత్య నాటక సంస్థ ఆధ్వర్యంలో జరగ్గా, ఆచార్య అనుమాండ్ల భూమయ్య సమగ్ర సాహిత్యం–సాహిత్య విమర్శ గ్రంథ ఆవిష్కరణ, అంకితం, శివధనుర్భంగం సాహితీ రూపక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రముఖ నాటక రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీవేత్త కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ సమగ్ర సాహిత్య విమర్శ గ్రంథాన్ని ఆవిష్కరించగా, రచయిత ఆచార్య అనుమాండ్ల భూమయ్య కావ్యాన్ని ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు అంకితం చేశారు. అనంతరం శివధనుర్భంగం సాహితీరూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. వాల్మీకిగా గురుసహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్, గోన బుద్ధారెడ్డిగా ఆచార్య అనుమాండ్ల భూమయ్య, మల్లికార్జునభట్టుగా కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, బమ్మెర పోతనగా ప్రముఖ సాహితీవేత్త సీవీవీ.సత్యనారాయణమూర్తి, ఆతుకూరి మొల్లగా సాహితీవేత్త ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి, విశ్వ నాథ సత్యనారాయణగా సాహితీవేత్త, ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, జంధ్యాల పాప య్య శాస్త్రిగా ప్రముఖ సాహితీవేత్త అద్దంకి శ్రీనివాస్‌లు తమ పద్యగానాలతో అలరించాయి. సాహితీవేత్తలను సత్కరించగా, సంస్కృతి వ్యవస్థాపకులు సర్రాజు బాలచంద్రరావు, సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పనలో బోర్డు పాత్ర ప్రధానం

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్




మాట్లాడుతున్న టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయం సజావుగా సాగేలా చూడటం, పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, ఎగుమతులను ప్రోత్సహించడంలో పొగాకు బోర్డు ప్రధాన పాత్ర పోషిస్తోందని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గుంటూరు చుట్టుగుంటలోని రైతు భవన్‌లో పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత ప్రభుత్వ నియంత్రణలో పొగాకు పరిశ్రమ సమగ్ర అభివృద్ధి కోసం 1976 జనవరి 1వ తేదీన పొగాకు బోర్డు చట్టం 1975 ద్వారా పొగాకు బోర్డు స్థాపించడం జరిగిందన్నారు. ప్రపంచంలోనే పొగాకు ఉత్పత్తిలో చైనా తర్వాత భారతదేశం రెండో స్థానంలో, వర్జీనియా పొగాకు ఉత్పత్తిలో 4వ స్థానంలో ఉందని వెల్లడించారు. బ్రెజిల్ తర్వాత ముడి పొగాకు ఎగుమతి చేసే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉందని, పొగాకు ఎగుమతుల ద్వారా భారత ఖజానాకు గణనీయమైన విదేశీ మారకద్రవ్యాన్ని అందిస్తున్నాయని పేర్కొన్నారు. 2023–24లో భారత పొగాకు ఎగుమతుల విలువ రూ.12,005.89 కోట్లుగా నమోదైందని చెప్పారు. దేశంలో పొగాకు పరిశ్రమ సుస్థిరత కోసం బోర్డు అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. దేశీయ అవసరాలు, అంతర్జాతీయ ఎగుమతి డిమాండ్‌కు అనుగుణంగా వర్జీనియా (ఎఫ్‌సీవీ) పంట ప్రణాళిక తయారు చేయడం, ఉత్పత్తి నియంత్రణ చేపడుతున్నట్లు వివరించారు. బ్యాంకుల ద్వారా రైతులకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడంలో సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. పొగాకు బేళ్లను ఎలక్ట్రానిక్ వేలం ద్వారా నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తున్నామన్నారు. 2023–24లో కిలో పొగాకుకు సగటు ధర రూ.288.65 లభించిందని తెలిపారు. 2023–24లో పొగాకు రైతులు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొన్నప్పటికీ, వారి సంకల్పం కృషి ఫలితంగా రికార్డు స్థాయిలో 215.35 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయిందని తెలిపారు. 2023–24 సీజన్‌లో పొగాకు రైతులు రూ.6,313.58 కోట్లు ఆర్జించినట్లు చెప్పారు. గత ఏడాది సగటు ధర రూ.225.73తో పోలిస్తే ఈ సీజన్‌లో కిలోకు సగటున రూ.62.92 పెరిగిందని గుర్తుచేశారు. అదనంగా పండించిన 76.84 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలకు జరిమానాలను మాఫీ చేయడం వల్ల 38,751 మంది రైతులకు రూ.184 కోట్ల మేర లబ్ధి చేకూరిందని వెల్లడించారు. 2024–25 సీజన్‌లో కూడా మెరుగైన ధర రాబట్టేందుకు శతవిధాలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించి, రైతులు, అధికారులు, వ్యాపారుల సలహాలు, సూచనలు స్వీకరించి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసి ముందుకు వెళ్తామని వారు పేర్కొన్నారు. అనంతరం జరిగిన బోర్డు వ్యవస్థాపక దినోత్సవంలో పలువురు ఉత్తమ రైతులు, అధికారులను సత్కరించారు.

పదో తరగతి విద్యార్థిని బలవన్మరణం

నాదెండ్ల: పదో తరగతి విద్యార్థిని ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. గణపవరం అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉండే పాటిబండ్ల నాగేశ్వరరావు, రాహేలు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. నాగేశ్వరరావు పొగాకు బ్యారన్ పనుల నిమిత్తం ప్రకాశం జిల్లా వెళ్లాడు. రాహేలు స్థానికంగా పొగాకు పనులకు వెళ్తుంది. వీరి పెద్ద కుమార్తె మంజు అలియాస్ నవ్య (16) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చిన్నకుమార్తె జోన్స్ ఎనిమిదో తరగతి చదువుతోంది. చదువులో ఇద్దరూ చురుగ్గా ఉండేవారు. సోమవారం ఏం జరిగిందో తెలియదుకానీ పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వచ్చిన పెద్ద కుమార్తె నవ్య ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుంది. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన చిన్న కుమార్తె ఎంతసేపు తలుపు కొట్టినా తీయకపోవటంతో ఇతర కుటుంబ సభ్యులకు తెలిపింది. కిటికీ లోంచి చూడగా ఉరేసుకుని మరణించి ఉంది. ఈ దుర్ఘటనతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం బాలిక అంత్యక్రియలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఉపాధ్యాయులు బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎన్‌టీఏ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించినట్లు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నడిపినేని వెంకట్రావు, బొనిగల హైమారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఎన్‌టీఏ నాయకులు బీవీ నాగేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, గుంటూరు, పల్నాడు జిల్లా శాఖల అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖలీల్, కె.సాంబశివరావు, పి. సాయి విశ్వనాధ్, పి.లలితబాబు, ఎన్.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సిద్ధార్థ నగర్‌లోని ఆయన నివాసానికి పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు చేరుకుని ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాంబాబును సత్కరించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, దేవుని ఆశీస్సులు అందరికి ఉండాలని ఆకాంక్షించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



మాట్లాడుతున్న మణిలాల్

రేపల్లె రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. మణిలాల్ అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. రాష్ట్రంలో బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డు పేరుకే ఉందని, అది సక్రమంగా పని చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో పెద్దఎత్తున భవన నిర్మాణ కార్మికులు ఇసుక లేకపోవడంతో ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. కార్మికుల పెండింగ్ క్లయిమ్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నూతన సంవత్సర కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ ధర్మరాజు, భిక్షాలు, నాంచారయ్య, శంకర్, రాజు, ఉమా పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్ల నంబర్లు మార్పు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని పలు ప్యాసింజర్ రైళ్ల నంబర్లను ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి మార్పు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని కోరారు.

రైలు పేరు	పాత నంబరు	కొత్తది	రైలు పేరు	పాత నంబరు	కొత్తది
నాగిరెడ్డి పల్లి–మిర్యాలగూడ	07276	67775	రేపల్లె–గుంటూరు	07785	67250
మిర్యాలగూడ–నాగిరెడ్డిపల్లి	07277	67777	గుంటూరు–రేపల్లె	07786	67223
మంగళగిరి–గుంటూరు	07281	67247	రేపల్లె–గుంటూరు	07787	67234
తెనాలి–గుంటూరు	07282	67236	గుంటూరు–విజయవాడ	07788	57202
నంద్యాల–రేణిగుంట	07284	77211	కాచిగూడ–నడికుడి	07791	67779
రేణిగుంట–నంద్యాల	07285	77212	నడికుడి–కాచిగూడ	07792	67780
విజయవాడ–గుంటూరు	07464	67769	గుంటూరు–విజయవాడ	07864	67230
గుంటూరు–విజయవాడ	07465	67765	రేపల్లె–తెనాలి	07873	67224
నడికుడి–మాచర్ల	07579	57205	తెనాలి–రేపల్లె	07874	67231
మాచర్ల–నడికుడి	07580	57206	రేపల్లె– తెనాలి	07875	67232
విజయవాడ–గుంటూరు	07628	67229	తెనాలి–రేపల్లె	07876	67233
గుంటూరు–మాచర్ల	07779	57203	గుంటూరు–తెనాలి	07887	67235
మాచర్ల–గుంటూరు	07780	57204	తెనాలి–రేపల్లె	07888	67238
విజయవాడ–మాచర్ల	07781	67227	మార్కాపురం–తెనాలి	07890	67239
మాచర్ల–విజయవాడ	07782	67228	నడికుడి–మిర్యాలగూడ	07973	67778
విజయవాడ–గుంటూరు	07783	57201	మిర్యాలగూడ–కాచిగూడ	07974	67776
గుంటూరు–రేపల్లె	07784	67249	గుంటూరు–విజయవాడ	07976	67248

మహిళపై రాడ్‌తో వ్యక్తి దాడి

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు
- నిందితుడికి అండగా స్థానిక నాయకుడు
- మతిస్థిమితం లేదని పేర్కొంటూ రాజీ యత్నాలు



చేతిపై గాయం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

తాడేపల్లి రూరల్: బతుకు దెరువు కోసం వచ్చిన కుటుంబంపై ఓ వ్యక్తి రాడ్‌తో విచక్షణారహితంగా బుధవారం సాయంత్రం దాడి చేయడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. బాధితులు, వారి బంధువుల కథనం ప్రకారం.. యూపీ నుంచి వచ్చిన వీరేంద్ర ప్రసాద్ మౌర్య, గీతా మౌర్య దంపతులు పట్టాభిరామయ్య కాలనీలో ఉంటున్నారు. వీరేంద్ర ప్రసాద్ మౌర్య సీలింగ్ పనులు చేస్తుంటాడు. నూతన సంవత్సరం కావడంతో సాయంత్రం సమయంలో సరదాగా బయటకు వెళ్లేందుకు ఇంట్లో నుంచి దంపతులు బయటకు వచ్చారు. అదే సమయంలో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి 'మీరు ఇళ్లల్లో కూర్చోక రోడ్లపై ఎందుకు తిరుగుతున్నారంటూ' రాడ్ తీసుకుని గీతా మౌర్యపై దాడికి పాల్పడ్డాడు. వీరేంద్ర ఆపేందుకు ప్రయత్నించగా అతడిపైనా దాడికి యత్నించాడు. వీరేంద్ర పారిపోయాడు. గీతా మౌర్యను కాళ్లపై వెనుక నుండి రాడ్‌తో కొట్టడంతో ఆమె అక్కడే కుప్పకూలిపోయింది. తర్వాత విచక్షణరహితంగా పలుమార్లు రాడ్‌తో కొట్టి అక్కడి నుండి పరారయ్యాడు. నిందితుడి బంధువులు మాత్రం అతడికి మతిస్థిమితం లేదని, దాడి గురించి పట్టించుకోవద్దని, ఆసుపత్రికి వెళ్లండని ఉచిత సలహాలు ఇచ్చారు. తీవ్రంగా గాయపడిన గీత మౌర్యను వైద్య నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రెండు కాళ్లు, తుంటి భాగం, రెండు చేతులపై తీవ్ర గాయాలు అయ్యా యి. మతిస్థిమితం లేని వ్యక్తిని ఇంట్లో ఉంచకుండా మద్యం తాగించి రోడ్లపై తిరగనివ్వడమేంటని బాధితుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక నాయకుడు ఒకరు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోకుండా అడ్డుపడుతున్నట్లు తెలిసింది. నిందితుడికి మతిస్థిమితం లేదని, పొరపాటు జరిగిందని అంటూ బాధిత కుటుంబ సభ్యులతో రాజీ ప్రయత్నాలు చేస్తున్నాడు.

కానుకమాత చర్చిలో ప్రత్యేక దివ్య పూజాబలి



కానుకమాత చర్చి ఆవరణలో ప్రత్యేక పవిత్ర సమష్టి దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్లు

రెంటచింతల: రాష్ట్రంలోనే పేరు పొందిన స్థానిక కానుకమాత చర్చి ఆవరణలో విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మంగళవారం అర్ధరాత్రి రాజుపాలెం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఏరువ పీటర్, సహాయ గురువులు అగస్టీన్, ఫాదర్ తుమ్మా థామస్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేక పవిత్ర సమష్టి దివ్యపూజాబలిని సమర్పించారు. ఫాదర్ పీటర్ మాట్లాడుతూ యెహోవా దేవుని కుమారుడైన లోకరక్షకుడు ఏసుక్రీస్తును ఆరాధించి ఐదు సూత్రాలను అమలుచేయడం వల్ల నూతన సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. ఇతరులకు మనం చేసిన వాగ్దానం మరువకుండా 40రోజుల పాటు అమలుచేయడానికి ప్రయత్నం చేయాలని, అప్పుడే సంఘంలో గుర్తింపు లభిస్తుందన్నారు. అర్ధరాత్రి 12 గంటలకు గణగణమంటూ గంటలు కొడుతూ భారీగా బాణ సంచా కాల్చి 2025కు స్వాగతం పలికి భక్తులు ఒకరికొకరు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక పూజాబలిలో పాల్గొన్న 2 వేలమంది భక్తులకు కేక్ ముక్కలను పంపిణీ చేశారు. స్థానిక ఆంధ్రవాంజికల్ లూథరన్ చర్చిలో సువార్తికులు డేగల దేవానందం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నూతన సంవత్సరం పురస్కరించుకుని బుధవారం స్థానిక శివాలయంలో, పాలువాయి జంక్షన్‌లో నున్న శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో, షిరిడి సాయి మందిరంలో, ఆంజనేయస్వామి ఆలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు.

బీమకోరేగావ్ వీరుల స్ఫూర్తితో పోరాటాలు



పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

నరసరావుపేట: బీమకోరేగావ్ మహర్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలకు సంసిద్ధం కావాల్సిన అవసరం ఉందని కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గడియారం స్తంభం వద్ద ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీమ కోరేగావ్ మృత వీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర పూణే జిల్లాలోని శిరూర్ తాలూకా బీమ నది ఒడ్డున ఉన్న కోరేగావ్ అనే గ్రామంలో 1818 జనవరి 1న బ్రిటిష్ ఇండియా కంపెనీ సైన్యానికి, పీష్వా సైన్యానికి జరిగిన బీకర యుద్ధంలో దళితులు వీరోచితంగా పోరాడారని పేర్కొన్నారు. 22 మంది దళితులు అమరులయ్యారని పేర్కొన్నారు. వీరి స్మరణ కోసం నిర్మించిన స్థూపాన్ని 1927 జనవరి 1న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ సందర్శించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్నప్రసాద్, సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ లత, ఇతర సిబ్బంది

నెహ్రూనగర్: ఆర్మీ లో డ్రైవర్‌గా పని చేసి రిటైర్డ్ అయిన వ్యక్తి గుంటూరులోని మిలిటరీ క్యాంటీన్ నుంచి మద్యం కొనుగోలు చేసి బయట అధిక రేట్లకు విక్రయిస్తుండగా బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ 1 టౌన్ స్టేషన్ సీఐ బి.లత పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌కు చెందిన అన్నపురెడ్డి సాంబశివరెడ్డి ఆర్మీలో డ్రైవర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. కొంత కాలంగా మిలటరీ క్యాంటీన్‌లో తక్కువ రేటుకి మద్యాన్ని కొనుగోలు ఎక్కువ రేటుకు అమ్ముతున్నాడనే సమాచారం మేరకు బుధవారం బీఆర్ స్టేడియం వద్ద అరెస్టు చేశారు. అతని నుంచి 13 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు ఎండీ కాశీం షరీఫ్, తిరుమలేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బస్తాలు సీజ్



సీజ్ చేసిన రేషన్ బియ్యం

మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలో బుధవారం రాత్రి రేషన్ బియ్యం బస్తాలు పట్టుబడ్డాయి. మేడికొండూరు పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు పేరేచర్ల సమీపంలోని దేవసేన రైస్‌మిల్లు సమీపంలో మేడికొండూరు ఎస్సై షేక్ ఖాజీ బాబు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. 120 బస్తాల రేషన్ బియ్యంతో మినీ లారీలో దేవసేన రైస్ మిల్లుకు వచ్చిన డ్రైవర్ పోలీసులను చూసి దాన్ని వదిలి పరారయ్యాడు. మేడికొండూరు ఎస్సై ఖాజీబాబు అనుమానంతో లారీని తనిఖీ చేశారు. రేషన్ బియ్యంతో పాటు లారీని సీజ్ చేసి మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.